
6 | నమస్తే తెలంగాణ | 7
నిజామాబాద్
శుక్రవారం 24
నవంబర్ 2023

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## కాంగ్రెస్‌ను నమ్మితే.. చిప్ప చేతికే..



మూడు గంటల కరెంటుతో పొలాలు ఎండుడే..

- పంట పండదు..పెట్టుబడీ రాదని రైతుల ఆవేదన
- అప్పులబాధతో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యే ప్రమాదం
- 10 హెచ్‌పీ మోటర్లు నడ్వవు..
- అదనపు ఖర్చులు పెట్టించాలని చూస్తున్న కాంగ్రెసోళ్లు..
- సీఎం కేసీఆర్ ఇచ్చే 24గంటల కరెంటే చాలు..
- మార్పులు వద్దు.. కాంగ్రెస్‌ను రానివ్వొద్దని స్పష్టం చేస్తున్న రైతాంగం



**ఎవుసానికి** మూడు గంటల కరెంటు చాలు.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని పంటలు పండించుకోవాలని కాంగ్రెసోళ్లు చేస్తున్న వ్యాఖ్యలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుత నేతల మాటల్ని వింటున్న రైతన్నలు...పదేండ్ల కిందటి పరిస్థితులే వస్తాయని చెబుతున్నారు. కాంగ్రెస్ హయాంలో సరైన కరెంటు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి.. పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి.. అవి కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఇంకా మదిలోనే ఉన్నాయంటున్నారు. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి వాళ్లు ఇచ్చే మూడు గంటల కరెంటుతో పంట పండదు... పెట్టుబడి డబ్బులు కూడా రావని అంటున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్న కాంగ్రెసోళ్లకు అవి ఎవుసానికి ఉపయోగిస్తారా? లేదా? తెలుసుకొని మాట్లాడాలని హితవు పలుకుతున్నారు. వ్యవసాయానికి పనికిరాని 10హెచ్‌పీ మోటర్ల పేరిట రైతుల నెత్తిన అదనపు ఖర్చుల భారం మోపాలని కాంగ్రెసోళ్లు చూస్తున్నారని మండిపడుతున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో 24గంటల కరెంటుతో బీడుభూములన్నీ పచ్చబడ్డాయని, మేమంతా సంతోషంగా బతుకుతున్నామని అంటున్నారు. మార్పులు తెచ్చి మా చావులను కోరే కాంగ్రెస్‌ను రానివ్వబోమని, మా క్షేమాన్ని తలచే సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకుంటామని స్పష్టంచేస్తున్నారు. మూడు గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లపై రైతులు వెల్లడించిన అభిప్రాయాలు వారిమాటల్లోనే...

– నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 23

### మూడు గంటల కరెంట్‌తోటి మళ్లా ఆగమే



ఖలీల్‌వాడి, నవంబర్ 23 : రైతులకు 3 గంటల కరెంట్ అసలే సరిపోదు. గతంలో రాత్రి కరెంట్ ఉండేది. రాత్రి పూట మోటర్లు చాలు జేసేందుకు పోయి మస్తు తిప్పలు వడ్డం.. సీఎం కేసీఆర్ దయతో నేడు కరెంట్‌కు రంది లేకుండా పోయింది. ఇప్పుడు ఏ సమస్య లేదు. గిప్పుడు కాంగ్రెసోళ్లు ఓట్ల కోసం ఇష్టమచ్చినట్లు మాట్లాడుతుండ్రు. చాలా మంది చిన్న రైతులే ఉన్నరు. పెద్దమోటర్లు పెట్టుడంటే మస్తు పైసల్ అయితై. ఏం తెల్వనోళ్లు ఏమోమో మాట్లాడుతుండ్రు. కేసీఆర్ సారు రైతుల కరెంట్ కష్టాలు తీర్చిండు.

**-నారాయణ, రైతు, న్యాల్‌కల్ గ్రామం**

### ఒక్క మడి కూడా పారదు



బీఆర్‌ఎస్ గవర్నమెంటు ఎవుసానికి 24 గంటల కరెంటి ఇచ్చుడుతోటి మంచిగ పంటలు పండించుకుంటున్నం. దిగుబడి మంచిగ అస్తున్నది. రైతుబంధు కూడా ఇచ్చుడుతోటి పెట్టుబడికి రంది లేకుండా పోయింది. గిప్పుడు ఎన్నికలు అచ్చుడుతోటి కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటు చాలని అంటుండ్రు. ఆళ్లకు ఎవుసం గురించి ఏం తెలుసు. మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా పారదు. మళ్లా పైసల్ పెట్టి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటుండ్రు. లోవోల్టేజీతోటి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. కాంగ్రెసోళ్లు అంటేనే భయమైతుంది.

**-సతీశ్‌రావు, రైతు, న్యాల్‌కల్ గ్రామం**

### కాంగ్రెస్‌ను నమ్మితే పాత రోజులే..



రైతులకు 3 గంటల కరెంటు దేనికీ సరిపోదు. ఏ అవగాహనతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటుతోటి రైతులు దర్జాగా పొలాలు పండించుకుంటున్నారు. రాత్రుళ్లు పొలాల దగ్గరకు పోవుడు బాధ తప్పింది. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కష్టాలే. విద్యుత్ ప్రమాదాలు మళ్లీ జరుగుతాయి. ఏ రైతుకు కూడా 10 హెచ్‌పీ మోటరు అవసరం లేదు. ఈ ప్రాంతంలో ప్రతి రైతు మూడు నుంచి ఐదు హెచ్‌పీ మోటర్లే వాడుతున్నారు.

**-సాయి రెడ్డి, రైతు, సిర్పూర్**

### కాంగ్రెసోళ్లకు ఎవుసం ఏం తెలుసు?



రైతులకు మూడు గంటల కరెంటు మస్తు అని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోండ్రని చెబుతున్నారు. వాళ్లకు అసలు వ్యవసాయం గురించి ఏమన్నా తెలుసా? మా ప్రాంతంలో 10 హెచ్‌పీ మోటర్లు ఎవరూ వాడరు. మాకు 5 హెచ్‌పీ మోటర్లే సరిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఎందుకు 10హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తారు. ఈ మోటర్లు కొనాలంటే లక్ష రూపాయల దాకా ఖర్చు అవుతుంది. భూగర్భ జలాలు సైతం ఇట్టే ఇంకిపోతాయి. వద్దు మళ్లీ పాత రోజులు రావొద్దు.

**- గంగూబాయి,మహిళా రైతు, సిర్పూర్**

### రేవంత్‌కు ఎవుసం గురించి ఏం తెలుసు.. ?



24 గంటలు ఉచిత కరెంట్‌తో పసిడి పంటలు పండిస్తున్నాం. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. చిన్న, సన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడరు. రేవంత్‌రెడ్డి అలాంటి పనికి మాలిన మాటలు మాట్లాడడం సరికాదు. నాకు 25 ఎకరాల భూమి ఉంది. ఇందులో రెండు, మూడు పంటలు సాగు చేస్తాను. రెండు, మూడు రోజులకొకసారి నీరు పారిస్తా. నాకు 5 హెచ్‌పీ మోటరుతో పంటలకు సరిపడా నీరందిస్తున్నా. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ రైతులకు ఉచితంగా ఇస్తుంటే కాంగ్రెసోళ్లు ఓట్ల కోసం ఇలా రైతులతో రాజకీయం చేస్తున్నారు. అందుకే 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసే కేసీఆర్ ప్రభుత్వానికే అండగా ఉంటాం.

**-భూమన్న, రైతు, కంజర**

### రైతులు బాగుపడడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేదు



అసలు రైతులు బాగు పడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. గతం నుంచి ఇదే తంతు. అప్పట్ల ఆళ్ల రాత్రిపూట కరెంటు ఇచ్చుడుతోటి పొలాల పొంటి తెల్లందాక ఉరకవడుతుండె. కరెంట్ షాక్ కొట్టుడు, పాముకాటుతో సచ్చిపోవుడు ఉంటుండె. తెలంగాణ అచ్చినంక సుఖంగా ఇంటికాడనే పడుకుంటున్నాం. రేవంత్‌రెడ్డి మూడు అడుగులు ఉండి.. మూడు గంటల కరెంట్ అంటున్నాడు. ఓట్ల దెబ్బకు రేవంత్ రెడ్డి ఆంధ్రకు పారిపోవుడు ఖాయం.

**-సాయవ్వ, మహిళా రైతు, బాడ్సి**

### కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుల పని ఖతం



కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతే రాజు అని మనం వినడం తప్ప చూడలేము. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలంటున్నాడు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నాడు. ఇట్ల చేస్తే మళ్లీ వ్యవసాయం బంద్ చేసుకొని మళ్లా పట్టణాలకు కూలీ పనులకు పోవుడు అయితది. కాంగ్రెసోళ్లు అస్తే మళ్లీ కష్టాలు మొదలవుతాయి. ఇప్పుడు ఇంత మంచిగా వ్యవసాయం చేసుకుంటున్నాం. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుల పని ఖతమే. నీళ్ల కోసం కొట్టుకునే పరిస్థితులు వస్తాయి. ఇదంతా మనకు అవసరమా. ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం.

**-నర్సారెడ్డి, రైతు, బాడ్సి**

### కరెంటు కష్టాలు మళ్లీ వద్దు..



ఖలీల్‌వాడి, నవంబర్ 23 : కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. పంటలు వేయాలంటనే భయపడే పరిస్థితి ఉండేది. రాత్రి పూట కరంటు కోసం పొలాల కాడ పండుకునేటోళ్లం. కానీ బీఆర్‌ఎస్ సర్కారు వచ్చిన అన్ని బాధలు పోయినయ్. పొద్దున పూటనే పొలాలకు నీళ్లు పారించుకుంటున్నాం. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్నాం. కాంగ్రెసోళ్లకు రైతులు మంచిగుంటే చూడ బుద్ధి అయితలేనట్లున్నది.

**-నర్సయ్య, రైతు, నర్సింగ్‌పల్లి**

### కాంగ్రెస్ అంటేనే కరెంటు కోతలు



కాంగ్రెస్ అంటేనే కరెంటు కోతలు గుర్తుకు వస్తాయి. మళ్లా ఇప్పుడు వ్యవసాయానికి మూడు గంటలు కరెంటు చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నారు. అసలు వ్యవసాయం గురించి వాళ్లకు ఏం తెలుసు?. నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే మస్తు పైసల్ అయితయ్. అవి ఎవ్వళ్లు ఇస్తారు. అందరూ రైతులు 10హెచ్ మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మళ్లా కరెంట్ కష్టాలు మొదలై రైతు ఆగమయ్యే ప్రమాదముంది. కాంగ్రెసోళ్లు అద్దు.. ఆళ్ల కరెంటు అద్దు..

**-గంగారాం, రైతు, ముదక్‌పల్లి**

### మూడు గంటలతోటి ఆగమే



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటు ఇస్తామంటున్నారు. మూడు గంటల కరెంటు తోటి మూడు గుంటల భూమి కూడా తడవదు. 24గంటల కరెంటుతో మస్తు సౌలత్ అయ్యింది. పొలాలకు 10హెచ్‌పీ మోటర్లు ఎవ్వళ్లు వాడరు. కాల్వలు, చెరువుల్లో నీళ్లు తోడేందుకే ఈ మోటర్లు వాడుతారు. ఈ మోటర్లు పొలాలకు పెట్టుకుంటే ఒక్కసారికే నీళ్లు గుంజి పడేస్తది. బోర్లు ఎండిపోతాయి. కాంగ్రెస్‌కు ఓటు వేసి మళ్లా కరెంటు కష్టాలు తెచ్చుకునుడు అవసరమా? గిప్పుడు 24 కరెంటుతో మంచిగా పంటలు పండించుకుంటున్నాం. తెలిసి తెలిసి మళ్లా పాత కష్టాలు తెచ్చునుడు అవసరమా?

**-మహేశ్‌రెడ్డి, రైతు, ముదక్‌పల్లి**

### 24 గంటల కరెంట్.. రైతుకు ఊపిరి



సీఎం కేసీఆర్ వ్యవసాయానికి కరెంట్ సమృద్ధిగా ఇస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు మూడు గంటల కరెంట్ సరిపోదు. కాంగ్రెస్ పాలన వస్తే అంధకారం తప్పదు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతులు అవస్థలు పడ్డారు. అప్పట్లో ఎన్నోసార్లు కరెంట్ కోసం సబ్‌స్టేషన్లను ముట్టడించాం. వచ్చీరాని కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. రిపేర్ చేయించడంతో రైతులపై ఆర్థిక భారం పడేది. నీరు అందక పంటలు ఎండిపోయేవి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దు. వ్యవసాయానికి 24 గంటల కరెంటుతో ఎంతో మేలు జరుగుతున్నది. పంటలకు నీరు అందించేందుకు ఏ సమయంలోనైనా రైతులు మోటర్లు పెట్టుకుంటున్నారు. రైతులు ఆలోచించి రైతు ప్రభుత్వానికి అండగా నిలువాలి. కరెంట్ 3 గంటలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలి.

**-పెద్ద సాయిలు, రైతు, ముదక్‌పల్లి**

ఈ గట్టున హ్యాట్రిక్ సీఎం

ఆ గట్టున అందరూ సీఎంలే

ఈ గట్టునుంటావా?
ఆ గట్టునుంటావా?

నీ ఓటు ఎవరికి?

తెలంగాణమా తేల్చుకో



### కాంగ్రెస్ అంటేనే కరెంట్ కోతలు గుర్తుకు వస్తాయి.

కాంగ్రెస్ హయాంలో వ్యవసాయ అనుబంధ రంగాలు అన్ని అనేక ఇబ్బందులు పడ్డాయి. తెలంగాణ సాధించుకున్న తర్వాత కేసీఆర్ సీఎం కావడంతో కొత్త వెలుగులు వచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల కరెంటు ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ కాంగ్రెస్ నాయకులు పూటకో మాట మాట్లడుతున్నారు. రాష్ట్రంలో ఇంత మంచి కరెంట్ ఇస్తున్న ప్రభుత్వాన్ని వదులుకునే పరిస్థితి లేదు . మూడు గంటల కరెంట్‌పై మాట్లాడిన వారికి పదిరోజుల్లో రైతులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

**-కుమ్మరి నారాయణ, రైతు, బాడ్సి**

### ఒక్క పంట కూడా పండదు..

24 గంటల కరెంట్ ఇవ్వకపోతే పంటలు పండవు. రైతులు మళ్లీ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుంది. మూడు గంటలతోటి ఒక్క మడి కూడా పారదు. కాంగ్రెస్ హయాంలో ఈ బాధలన్నీ అనుభవించాం. నీళ్లులేక మస్తు కష్టాలు పడ్డాం. తెలిసితెలిసి మళ్లీ ఆ పరిస్థితిని తెచ్చుకోలేము. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తేనే రైతులు బతుకుతారు. లేదంటే మళ్లీ ఆత్మహత్యలే శరణ్యం అవుతాయి.

**-కూనల్ రెడ్డి, రైతు, బాడ్సి**

